జ్వాల దశ
నిజం.. నిర్భయంగా..
మంగళవారం
28-04-2026
జిల్లా వార్తలు
WWW. DASHANEWS. COM

## తాళం వేసిన ఇంట్లో దొంగతనం

❖ *నగదు, బంగారు ఆభరణాల అపహరణ*



**దశ, అబ్దుల్లాపూర్‌మెట్:** మండల పరిధిలోని పిగ్లీపూర్ గ్రామంలో భారీ దొంగతనం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బందేల బాలాజ్ ఆదివారం సాయంత్రం తన కుటుంబ సభ్యులతో కలిసి యాదాద్రి భువనగిరి జిల్లాలోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్లారు. మరుసటి రోజు ఉదయం ఆయన తిరిగి వచ్చేసరికి ఇంటి ప్రధాన ద్వారం తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూడగా బెడ్‌రూమ్‌లోని బీరువా తలుపులు కూడా బద్దలు కొట్టి ఉన్నాయి. అందులో భద్రపరిచిన ఒక బంగారు నెక్లెస్, ఒక బ్రాస్‌లెట్, ఒక జత ఉంగరాలు, ఒక జత చెవి కమ్మలతో పాటు వెండి ఆభరణాలు మరియు కొంత నగదును గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోయారు. బాధితుడు సోమవారం ఉదయం అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను పట్టుకునేందుకు క్లూస్ టీమ్ ఆధారాలు సేకరిస్తోంది. తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా దొంగలు రెచ్చిపోతుండటంతో స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## తార్నాకలో ఘనంగా రామచంద్ర రావు జన్మదిన వేడుకలు



**దశ ఓయూ :** బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు జన్మదిన వేడుకలను సోమవారం బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. తార్నాక లోని ఆయన నివాసం వద్ద రామచంద్ర రావు సోదరి డాక్టర్ పద్మావతి పారిశుద్ధ కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్కరాజు నిర్మల, స్థానిక బిజెపి నాయకులు ఉపేందర్ ,ప్రకాష్, గణేష్ ముదిరాజ్, జ్యోతి అనిత అనూష తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పారిశుద్య కార్మికులకు దుస్తుల పంపిణి



**దశ ఓయూ:** బిజేపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్రావు జన్మదిన వేడుకలను సోమవారం బిజేపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. బిజేపి రాష్ట్ర నాయకులు ఎస్. వెంకటేష్ గౌడ్, లక్ష్మీ ఆధ్వర్యంలో లాలాపేటలో 100 మంది జీహెచ్‌ఎంసీ పారిశుధ్య కార్మికులకు దుస్తులు(మహిళలకు చీరెలు, పురుషులకు ప్యాంట్, షర్టు) పంపిణి చేశారు. ఈ కార్యక్రమానికి బిజేపి రాష్ట్ర కార్యదర్శి బండారు విజయలక్ష్మీ ముఖ్య అతిధిగా హాజరైనారు. తార్నాకలోని రామ్మందర్రావు నివాసం వద్ద జరిగిన చీరెల పంపిణి కార్యక్రమంలో రామ్చందర్రావు సోదరీ డా. పద్మావతి పాల్గొన్నారు. 100 మంది పారిశుద్య కార్మికులకు చీరెలు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో డా. లక్కరాజు నిర్మల బీజేపీ మహిళా నాయకురాలు జ్యోతి, అనిత, అనూష తదితరులున్నారు. తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యునిటీ హాల్లో రక్తదాన శిభిరాన్ని ఏర్పాటు చేశారు. దీనికి ఎమ్మెల్సీ మల్క కొమురయ్య ముఖ్య అతిధిగా హాజరై శిభిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిజేపి నాయకులు ఉపేందర్, ప్రకాష్, గణేష్ ముదిరాజ్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నా కొడుకుని కాపాడండి అంటూ దళిత మహిళ ఆవేదన ..

❖ *సంతోష్ యాదవ్ అనే వ్యక్తి తన కొడుకుని కిడ్నప్ చేశాడని ఆరోపణ..*

❖ *పోలీసులు న్యాయం చేయాలంటూ దళిత సంఘాల నాయకుల డిమాండ్..*

**దశ ఓయూ :** తన కూతురిని ప్రేమించాడనే కోపంతో సంతోష్ యాదవ్ అనే వ్యక్తి తన కొడుకులను అన్యాయంగా కేసులలో ఇరికించి, చిత్ర హింసలు పెట్టి తమను బెదిరింపులకు గురిచేస్తున్నారని మీనా కుమారి అనే దళిత మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు పలువురు దళిత నాయకులు సోమవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితుల తల్లి మీనా కుమారి మాట్లాడుతూ...తన పెద్ద కొడుకు ప్రేమిస్తే వాడిని కిడ్నప్ చేసి కొట్టి కేసులో ఇరికించి, ఇప్పుడు మళ్లీ ఆదివారం రాత్రి తన చిన్న కొడుకు రాజీవ్ ని కూడా కిడ్నప్ చేశారని మీనా కుమారి ఆవేదన వ్యక్తం చేసింది. దళిత సామాజిక వర్గానికి చెందిన వారమనే కారణంగానే తమను చిత్ర హింసలకు గురిచేస్తున్నారని వాపోయింది. పోలీసులు కూడా తమకు న్యాయం చేయడం లేదని, తన కుమారుడి ఆచూకీ తెలపాలని కోరుతుంది. తల్లి తెలిపిన వివరాల ప్రకారం...

తన పెద్ద కుమారుడు అర్జున్ (23) ఇన్స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన యాదవ సామాజిక వర్గానికి చెందిన అమ్మాయిని ప్రేమించాడనే కోపంతో కక్ష్య పెంచుకొని అమ్మాయి తండ్రి సంతోష్ యాదవ్ గతంలో తన కొడుకుపై పోక్సో కేసు నమోదు చేయించారని చెప్పారు. మళ్లీ అమ్మాయి తన కొడుకుతో మాట్లాడుతుందని కోపం పెంచుకొని ఈ నెల 17వ తేదీన కిడ్నప్ కు గురి అయ్యాడని .అదే రోజు మియాపూర్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసిన పెద్దగా పట్టించుకోలేదు అన్నారు. మరుసటి రోజు లొకేషన్ యూసుఫ్ గూడ చెక్ పోస్ట్ వద్ద లొకేషన్ చూపిస్తుందని చెప్పి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. 19వ తేదీ న జూబ్లీ హిల్స్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారన్నారు. తన కొడుకును విపరీతంగా కొట్టి పోలీసులకు అప్పగించారన్నారు. తన కొడుకుని కొట్టి జూబ్లీహిల్స్ పోలీసులకు అప్పగించినట్లు సంతోష్ యాదవ్ తెలిపాడని , విషయం తెలుసుకొని స్టేషన్ కు వెళ్తే గాయాలతో కొడుకు కనిపించాడని చెప్పింది. తన చిన్న కొడుకు రాజీవ్ ని కూడా అలాగే కిడ్నప్ చేశారని కన్నీటి పెట్టుకుంది. తనకు న్యాయం చేయాలని వేడుకుంది.

అనంతరం దళిత నాయకులు డాక్టర్ మురహరి బుద్దారం,బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు దప్పు నర్సింగ్ రావు, కాసర్ల మధు మాట్లాడుతూ...తప్పు చేసిన వారికి చట్ట ప్రకారం శిక్ష పడాలని, కానీచట్టాన్ని చేతుల్లోకి తీసుకొని కిడ్నప్ చేయడం ఏంటని ప్రశ్నించారు. దప్పు అహంకారంతో పోలీసులను తప్పుదు త్రోవ పట్టించి అప్పుడు పెద్ద కొడుకుని, ఇప్పుడు చిన్న కొడుకుని ఎత్తుకెళ్లడం ఏంటని మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు దెబ్బ తింటున్నాయని పేర్కొన్నారు. మైనర్ బాలికలకు మాత్రమే కాదని బాలురకు కూడా దారుణ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. పోలీసులు ఇప్పుడైనా బాధిత కుటుంబ సభ్యులకు సహకారం అందించి, కిడ్నపర్ లను పట్టుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



## సూర్యాపేట మున్సిపాలిటీ 22 లో వార్డులో గణంగా బి.ఆర్.ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

❖ *జెండా ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్ట కిషోర్*

**దశ సూర్యాపేట ప్రతినిధి :** ఆంధ్ర వలస పాలనలో తెలంగాణ ప్రజల గోసను చూసి జగదీష్ రెడ్డి లాంటి కొద్ది మంది నాయకులతో ఉద్యమాన్ని ఆరంభించిన కేసిఆర్ అతి కొద్ది కాలంలోనే సబ్బండ వర్గాలను, తెలంగాణ సమాజాన్ని ఏకం చేస్తూ ఉద్యమాన్ని ముందుకు నడిపించారని మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్ట కిషోర్ అన్నారు. ఎన్ని అవమానాలు, అవహేలనలు ఎదురైనా మొక్కవోని దీక్షతో ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని నడిపించారని అన్నారు సాధించుకున్న తెలంగాణాను ప్రజల ఆకాంక్షల మేరకు భారత దేశంలోనే అగ్రభాగాన నిలిపారని అన్నారు. సమైక్యాంధ్రలో తెలంగాణ ప్రజల ఎదురుకోన్న త్రాగునీటి సమస్యను మిషన్ భగిరథ ద్వారా తీర్చారని అన్నారు. 24 గంటల నాణ్యమైన విద్యుత్ ను అందించి రైతులు భాదను తీర్చారని అన్నారు. మ్యానిఫెస్టోలో లేని రైతు బంధు, రైతు భీమా, కళ్యాణాలక్ష్మి, షాదిముబారక్ లాంటి సంక్షేమ పథకాలు అందించి రైతుల, సామాన్యుల, మనసులను గెలుచుకున్నారని అన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణను ఆంధ్ర పెత్తందారుల తొత్తుల చేతులోకి వెల్లడం దురదృష్టకరమని అన్నారు. అమలు కాని 420 హామీలను గ్యారెంటీలను ఇచ్చి తెలంగాణ సమాజాన్ని వంచించారని అన్నారు. తెలంగాణ ప్రజలందరికీ రేవంత్ రెడ్డి నిజస్వరూపం, కాంగ్రెస్ పార్టీ మోసాలు అర్థం అయ్యాయని అన్నారు. రానున్న రోజుల్లో మళ్ళి బి.ఆర్. ఎస్ పార్టీ అధికారంలోకి రావాలని, కేసిఆర్ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లు ఈద ప్రవీణ్, పడిదల సైదులు, అడ్వకేట్ నాతి సవిందర్, వార్డు అధ్యక్షుడు గోనే అశోక్, బి.ఆర్.ఎస్ నాయకులు మోత్కూరి దుర్గమ్మ, గుణగంటి కృష్ణ, పరెడ్డి ఉపెందర్, జాల శివ, సందీప్, మైసయ్యా, సోందు, అనంతుల లక్ష్మీ, ఉదయ్, సాయి, నవిన్, సౌజన్య, షంషు, మహేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## తమ విధుల్లోనే మమ్మల్ని కొనసాగించండి



❖ *నాగోల్ సర్కిల్-11 అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వేడుకోలు*

**దశ, హైదరాబాద్:** తమను పాత పోస్టుల్లోనే కొనసాగించి న్యాయం చేయాలని కోరుతూ నాగోల్ సర్కిల్ 11కు చెందిన అవుట్‌సోర్సింగ్ బిల్ కలెక్టర్లు మరియు టౌన్ ప్లానింగ్ ఛేజ్‌మెన్లు తెలంగాణ ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. గత 25 సంవత్సరాలుగా గ్రామ పంచాయతీ స్థాయి నుండి నేటి మల్కాజిగిరి మునిసిపల్ కార్పొరేషన్ వరకు తాము నిరంతర సేవలు అందిస్తున్నామని, ఎన్నికల విధులు, జనాభా లెక్కల సేకరణ మరియు పన్ను వసూళ్లలో కీలక పాత్ర పోషించామని వారు పేర్కొన్నారు. అయితే, ప్రస్తుతం తమను బిల్ కలెక్టర్లు, టౌన్ ప్లానింగ్ విభాగాల నుండి క్రొత్తగా ప్రజా ఆరోగ్య శాఖలోకి మార్చాలని చూస్తున్నారని, దీనివల్ల తమకు అన్యాయం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2025 26 ఆర్థిక సంవత్సరంలో కూడా రికార్డు స్థాయిలో ఇంటి పన్ను వసూలు చేసి సర్కిల్‌కు మంచి పేరు తెచ్చామని గుర్తు చేస్తూ, తమను ప్రజా ఆరోగ్య శాఖకు బదిలీ చేయకుండా పాత పోస్టుల్లోనే యథావిధిగా కొనసాగించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ మరియు స్పెషల్ ఆఫీసర్ కి వినతిపత్రం సమర్పించారు. దశాబ్దాలుగా నమ్ముకున్న వృత్తిలో తమకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని కోరారు.

## రామోజీ ఫిల్మ్ సిటీ క్వార్టర్స్‌లో యువకుడు అదృశ్యం



**దశ, అబ్దుల్లాపూర్‌మెట్:** మండలపరిధిలోని అనాజ్‌పూర్ గ్రామంలో గల రామోజీ ఫిల్మ్ సిటీ సహారా క్వార్టర్స్‌లో నివాసముంటున్న ఓ యువకుడు అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై బాధిత తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లా కొత్తవలస మండలం దేవడ గ్రామానికి చెందిన పొడుగు ఈశ్వరమ్మ, తన కుటుంబంతో కలిసి అనాజ్‌పూర్ గ్రామంలోని సహారా క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. ఆమె చిన్న కుమారుడు పొడుగు యేసు కుమార్ (24) రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 21న ఉదయం 10 గంటలకు విధులకు వెళ్లిన యేసు కుమార్, రాత్రి 7 గంటల సమయంలో తిరిగి ఇంటికి వచ్చాడు. కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసిన అనంతరం నిద్రపోయాడు. అయితే, మరుసటి రోజు (ఏప్రిల్ 22) ఉదయం 6 గంటలకు తల్లి ఈశ్వరమ్మ లేచి చూసేసరికి కుమారుడు ఇంట్లో కనిపించలేదు. కుమారుడు ఎంతకీ తిరిగి రాకపోవడంతో పాటు, ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఆందోళన చెందిన తల్లి ఆదివారం రాత్రి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ యువకుడి జాడ తెలిసిన వారు స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.




## సూర్యాపేట లో ఎరువుల దుకాణాల ఒకరోజు బంద్ సంపూర్ణం

**దశ సూర్యాపేట ప్రతినిధి :** ఎరువుల దుకాణాల డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర డీలర్ల అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు సూర్యాపేట పట్టణంలో ఎరువుల డీలర్లు సోమవారం నాడు సంపూర్ణ బందు పాటించి దుకాణాలు మూసివేశారు. ఈ సందర్భంగా సూర్యాపేట పట్టణ ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ , సీడ్స్ అసోసియేషన్ అధ్యక్షులు మొరిశెట్టి యోగి మాట్లాడుతూ ఎరువుల బస్తాలు దూర ప్రాంతం రైల్వే స్టేషన్ ల నుండి తెచ్చుకోవడం వల్ల ట్రాన్స్ పోర్ట్ చార్జిలు డీలర్లకు భారంగా మారిందని ఆయన అన్నారు. ట్రాన్స్ పోర్ట్ ఖర్చుల వలన ఎరువులు ఎమ్మార్పీ దరకు అమ్మితే నష్టాలు వస్తున్నాయని చెప్పారు. కాబట్టి దుకాణాల వద్దకు ప్రభుత్వం ఎరువుల బస్తాలను సరఫరా చేయాలని (ఎఫ్ ఒ ఎల్ ) డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఎరువుల కంపెనీలు లింక్ ఉత్పత్తులను సరఫరా చేయటం వల్ల అవి అమ్ముడుగాక పోవడం వల్ల స్టాక్ పెరిగి డీలర్లు ఐదు నుంచి పది లక్షల వరకు నష్టపోతున్నారని తెలిపారు. కాబట్టి ఎరువులను దుకాణల వద్ద డెలివరీ చేయాలని అలాగే ఈ లింకు ఉత్పత్తుల్ని బంద్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బందుకు సహకరించిన రైతులకు, దుకాణ యజమానులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ శ్రీకాకుళం రాము, ట్రెజరర్ ఉప్పల రమేష్, సభ్యులు మీలా యుగంధర్, ఉప్పల రవి, ఉప్పల శ్రీనివాస్, మిర్యాల రామ్మూర్తి, ఉప్పల ప్రవీణ్, పబ్బా ప్రకాష్, డీలర్లు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలపై నిరంతర సమరం చేసేది టీయూడబ్ల్యూజే

❖ *నేటి నుండి జిల్లావ్యాప్తంగా టీయూడబ్ల్యూజే (ఐజేయు) సభ్యత్వ క్యాంపెయిన్.*

❖ *టియుడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు చలసాని శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోల నాగేశ్వరరావు, డాక్టర్ కృష్ణ బంటు.*



**దశ సూర్యాపేట ప్రతినిధి :** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ సభ్యత్వాల ప్రారంభ కార్యక్రమం సూర్యాపేట జిల్లా కేంద్రంలో మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం అవుతుందని, సభ్యత్వం తీసుకునే జర్నలిస్టులందరూ సకాలంలో హాజరుకావాలని టి యు డబ్ల్యూ జే (ఐజేయు) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు చలసాని శ్రీనివాసరావు, టీయూడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షుడు, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు కోల నాగేశ్వరరావు, టి యు డబ్ల్యూ జే (ఐజేయు) సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు డాక్టర్ కృష్ణ బంటు లు తెలిపారు. సోమవారం వారు సూర్యాపేట జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం ఉదయం 8 గంటలకు సూర్యాపేట టీవీఎస్ షోరూం పక్కన ఆర్కే టవర్స్ వద్ద (చలసాని శ్రీనివాసరావు కార్యాలయం) సభ్యత్వాల ప్రారంభ కార్యక్రమం జరుగుతుందని వివరించారు. టీయూడబ్ల్యూజే ఐజేయు నిరంతరం జర్నలిస్టుల సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందని వెల్లడించారు. 1956లో ఏర్పడ్డ తమ యూనియన్ దేశంలోనే అతిపెద్ద యూనియన్ అని, 90 శాతం మంది జర్నలిస్టులకు ప్రాతినిధ్యం వహిస్తున్నామని, దేశంలోని అన్ని రాష్ట్రాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో కూడా తమ యూనియన్ అనుబంధ శాఖలు పనిచేస్తున్నాయని తెలిపారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్, యూనియన్ సలహాదారులు కే శ్రీనివాస్ రెడ్డి, యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు విరహత్ అలీ, రామ్ నారాయణ, ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు కొణిజేటి సత్యనారాయణ మార్గదర్శకత్వంలో జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల విషయంలో రాజీలేని పోరు కొనసాగుతూనే ఉందన్నారు. అర్హులైన జర్నలిస్టులు అందరికీ అక్రిడిటేషన్ అందేలాగా తమ యూనియన్ తక్షణ పకడ్బందీ చర్యలు చేపట్టిందన్నారు. అన్ని మండలాలకు సభ్యత్వ పుస్తకాలను మంగళవారం పంపిణీ చేయనున్నట్లు వారు తెలిపారు. చాలా కాలానికి యూనియన్ రాష్ట్ర నాయకత్వం సభ్యత్వాలు ఇవ్వాలని నిశ్చయించిందని, ఈ అవకాశాన్ని ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, వెబ్, యూట్యూబ్, సోషల్ మీడియా, పక్ష పత్రికలు, మాస పత్రికలు జర్నలిస్టు మిత్రులందరు సద్వినియోగం చేసుకోవాలని చలసాని శ్రీనివాసరావు, కోల నాగేశ్వరరావు, డాక్టర్ కృష్ణ బంటు కోరారు.